క్లుప్తంగా

నేత్ర పర్వంగా వేణుగోపాలుని పుష్పయాగం

సామర్లకోట: పీబీ దేవంలో ఉన్న రుక్మిణీ సత్య భామ సమేత వేణు గోపాలస్వామి శ్రీపుష్ప యోగోత్సవం సోమవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. సాయంత్రం స్వామివారి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించి రాత్రి ఆలయానికి చేరిన ఉత్సవ విగ్రహాలకు శ్రీపుష్పయోగోత్సవం నిర్వహించారు. సుందర్రెడ్డి మధుకిరణ్, ప్రియదర్శిని దంతపులు పీటలపై కూర్చుని ఉత్సవాలను జరిపించారు. భక్తులు పూజలను తిలకించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మలకల సుబ్బయ్యమ్మ, కమిటీ నాయకులు కంటిపూడి గోపాలం, తోటకూర శ్రీనివాస ప్రకాశరావు, పేపకాయల సత్తిబాబు, పాల్గొన్నారు. ఆలయ అర్చకులు పాణింగ పల్లి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిపించారు.

మరిడమ్మకు బంగారు పుష్పాలతో పూజ


స్వర్ణ పుష్పాలతో అమ్మవారు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి మంగళవారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, హోమాలతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గోవిందరాజుకు ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి శివారు వెంకటరాయపురానికి చెందిన తోలెం గోవిందరాజు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై రెండు కాళ్లు పని చేయకపోవడంతో అంగవైకల్యానికి గురయ్యాడు. మంగళవారం విష్ణు ఆస్పత్రి అధినేత, జనసేన పార్టీ నాయకుడు పిల్లా శ్రీధర్ గోవిందరావును పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు 'కోట' విద్యార్థి


కోరిపోలు బాబిని అభినందించిన వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక బ్రాహ్మణ అగ్రహారానికి చెందిన కోరిపోలు బాబి జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల ఆదికవి నన్నయా యూనివర్సిటీ పరిధిలో కాకినాడ పీఆర్ కళాశాలలో జరిగిన జూనియర్ బాడీ కేటగిరిలో 105 కేజీల పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించాడు. దీనికి తోడు ఆల్ ఇండియా నేషనల్ యూనివర్సిటీ పోటీలకు బాబీ ఎంపికయ్యాడని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు విప్పర్తి కొండలరావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబిని సత్కరించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో విప్పర్తి కొండలరావు, థామస్, మద్దాల వెంకన్న, లింగం శివప్రసాద్, సైపుల్లా, ఇరుసుమళ్ల రవికుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్ని బాబీని అభినందించారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

పెద్దాపురం: జె.తిమ్మాపురం గ్రామ పరిధి పంటపొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై మంగళవారం సాయంత్రం పెద్దాపురం పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై వెలుగుల సురేష్ బృందం దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఈ దాడుల్లో రూ.8500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ నబీ తెలిపారు.

జడ్జి పదవి మరింత బాధ్యతాయుతమైనది

కాకినాడ లీగల్: జడ్జిలుగా ఎంపికైన తర్వాత మరింత బాధ్యత పెరుగుతుందని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి నూతనంగా ఎంపికైన జడ్జిలకు సూచించారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఇటీవల న్యాయమూర్తులుగా ఎంపికైన ముగ్గురు న్యాయవాదులకు దుశ్శాలువ, మెమెంటోతో సత్కరించారు. అదనపు జిల్లా జడ్జిలు కమలాదేవి, హరి నారాయణ మాట్లాడుతూ పట్టుదలతో చదివి న్యాయమూర్తులైన వారు మరింత బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఎంపికైన ముగ్గురు న్యాయమూర్తులలో కందికట్ల రాణి శ్రీకాకుళం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే గొడ్ల స్వర్ణ, మైలబత్తుల దేవస్త దీపికలకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఎంపికైనవారు ముగ్గురు మాట్లాడుతూ తమ గురువులు, సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్‌లో న్యాయశాస్త్రంపై అవగాహన కల్పించడం తమకు ఎంతో ఉపయోగపడిందన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, జనరల్ సెక్రటరీ కె.శంకుసింగ్, ఉపాధ్యక్షుడు కేవీ ప్రతాప్ కుమార్, జాయింట్ సెక్రటరీ సుధీన శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


సచివాలయ గృహ సారథులకు కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- గృహ సారథుల శిక్షణలో పిలుపు

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు పిలుపునిచ్చారు. గొల్లప్రోలులో మంగళవారం వారికి శిక్షణ శిబిరం నిర్వహించి మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో దేశానికే గర్వకారణంగా ఉన్న మన రాష్ట్రంలో సీఎం జగన్ అమలుచేస్తున్న సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికే గృహ సారథులను నియమించినట్టు తెలిపారు. వార్డుల్లో వలంటీర్లతో పాటు పర్యటించి ప్రభుత్వ పథకాలు వివరిస్తూ, ఎవరికైనా ఇంకా అందాల్సి ఉంటే సమస్య తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. తద్వారా వైఎస్సార్ సీపీని గెలిపించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిన సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. టీడీపీ పాలనలో చంద్రబాబు, పచ్చ నేతలు చేసిన మోసాలు అక్రమాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇచ్చిన హామీలను విస్మరించిన చంద్రబాబును ప్రజలు ఇప్పటికే చీదరించుకున్నారని ఆయన తెలిపారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో పచ్చ చొక్కాలకే పథకాలు పంచుకుంటే సీఎం జగన్ మాత్రం పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతికి చోటు లేకుండా పైరవీలతో సంబంధం లేకుండా నేరుగా లబ్ధిదారుడి ఖాతాలకే సాయం అందేలా చేసారన్నారు. గొల్లప్రోలు జెడ్పీటీసీ వులవకాయల నాగలోవరాజు మాట్లాడుతూ ప్రజలందరు మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేయాలని, రావాలని చూస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు గృహ సారథుల విధి విధానాలను తెలియజేయగా పలువురు ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ గండ్రేటి మంగతాయారు, గండ్రేటి రాము, మొగలి అయ్యారావు, పార్టీ అధ్యక్షుడు పర్ల రాజా, సచివాలయ కన్వీనర్ మొగలి సాంబశివరావు, సొసైటీ అధ్యక్షుడు జ్యోతుల భీముడు, తెడ్లపు నాగేంద్ర, మొగలి జయబాబు గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


కాండ్రకోటలో గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి మరింత ప్రచారం చేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం మండలంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. దివిలిలో సర్పంచ్ పెంకే శ్రీనివాస్, జి.రాగంపేటలో ఏఎంసీ వైస్ చైర్మన్ బండారు వీరబాబు, ఆర్‌బీపట్నంలో గ్రామ సర్పంచ్ చీకట్ల లక్ష్మిల అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ పార్టీ రహితంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అటువంటి జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉంటుందన్నారు. 2024లో ఏపీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని దొరబాబు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గృహ సారథులును ఏర్పాటు చేశారని, వలంటీర్లకు సాయం అందిస్తు ప్రజా సంక్షేమ సేవపై గృహ సారథులు అవగాహన పెంచుకోవాలన్నారు. సమిష్టి కృషితో సీఎం జగన్‌మోహన్ రెడ్డి గెలుపుకు కృషి చేయాలని దొరబాబు పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఎంపీపీ పెంకే సత్యవతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీరాఘవరావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, ఏఎంసీ చైర్మన్ వల్లూరి జ్యోతి, నల్లల నాగేంద్రబాబు మాట్లాడుతూ ఈ దఫా ఎన్నికల్లో అబద్దాలు, సరైన పద్ధతిలో లేకుండా తప్పుడు ప్రచారాలతో ప్రతిపక్ష పార్టీలు ముందుకు వస్తున్నాయని, ఆ విధానాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. అనంతరం గృహ సారధులు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సరాలశెట్టి త్రినాథ్, కురిమెళ్ల లోవరాజు, కుంచే బుచ్చిరాజు, గుండేపల్లి వీరభద్రం, కర్రి జగదీష్, లక్కాకుల నానాజీ, సుందరెడ్డి రాజు, వైవీకే సాయి, వట్టికూటి రాజ్‌కుమార్, బోనాసు గుర్రాజు, తుమ్మల అచ్యుతరామయ్య, ఎద్దు కుమార్, బర్రే రామ గోవిందు, కంటే కృష్ణార్జున, వడ్డీకాసులు, పెంటా విజయ్‌కుమార్, ఆయా గ్రామాల వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సారా తయారీపై ఉక్కుపాదం

- జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు


పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

పెద్దాపురం: జిల్లాలోని సారా తయారీ కేంద్రాలపై ఉక్కుపాదం మోపినట్టు జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన పెద్దాపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులపై విచారణ, రిసప్షన్ పని తీరు తదితర విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎస్ఈబీ సహకారంతో పెద్దాపురం డివిజన్‌లో సారా నియంత్రణపై ప్రతిష్ఠ చర్యలు చేపడతాన్నారు. స్వచ్ఛందంగా మారిన వారికి పరివర్తన కార్యక్రమంలో భాగంగా రుణాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్‌కే అబ్దుల్ నబీ, ఎస్సై వెలుగుల సురేష్ ఉన్నారు.

కొండెవరంలో రచ్చబండ

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో మాజీ ఎమ్మెల్యే వర్మ రచ్చబండ, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ ఎంపీటీసీ గాది రాజబాబు, వేమగిరి రాంబాబు పాల్గొన్నారు.

పలువురి కుటుంబాలకు ఆర్థిక సహాయం

మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను వర్మ పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- మేడపాడులో గడప గడపకూ మన ప్రభుత్వం


లబ్ధిదారుతో మాట్లాడుతున్న దొరబాబు

సామర్లకోట: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావుల ఆధ్వర్యంలో దవులూరి దొరబాబు గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. వివిధ పథకాలల్లో గ్రామస్తులు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి సాధనాల నాగఫణిబాబు, సొసైటీ అధ్యక్షుడు వుటా వాసు పార్టీ నాయకులు ఎలిశెటి నరేష్, మేడిశెట్టి వెంకటరమణ, బుజ్జి హుస్సేన్‌పురం ఉపసర్పంచ్ యవర్న చంద్రశేఖర్, వీఆర్వోలు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు. అంతకు ముందు గ్రామంలో గృహ సారధులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణలో దొరబాబు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి భారీ ఏర్పాట్లు

- పంచారామ క్షేత్రంలో 16 నుంచి 21 వరకూ ఉత్సవాలు
- 16న రాత్రి ఘనంగా స్వామివారి కల్యాణం
- ఆలయంలో క్యూలైన్లు, చలువ పందిళ్లు


ఆలయం వద్ద చలువ పందిళ్లు వేస్తున్న కార్మికులు


పంచారామ క్షేత్రం వద్ద నీటితో నిండిన కోనేరు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వర స్వామి కోరిన కోర్కెలు తీర్చుతాడని భక్తుల నమ్మకం. రాష్ట్రంలో అతి ప్రాచీన పంచారామక్షేత్రాల్లో ప్రముఖమైనది సామర్లకోటలోని భీమేశ్వరుని క్షేత్రం. ఈ క్షేత్రం పూర్వం చాళుక్య భీమవరంగా ప్రసిద్ధి చెందినట్టు ఇక్కడ శిలా శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ లింగాన్ని స్వయంగా కుమరస్వామి ప్రతిష్ఠించాడని కుమారరామ భీమేశ్వరస్వామిగా పిలుస్తారు. చారిత్మకంగా చూస్తే పిఠాపురంలో లభించిన శాసనం ప్రకారం 9వ శతాబ్ది చివరిలో వేంగి చాళుక్య పాలకుడైన మొదటి చాళుక్య భీముడు ఈ ఆలయాన్ని నిర్మించిన్నట్టు తెలుస్తుంది. దాంతో ఈ ఆలయాన్ని చాళుక్య శ్రీకుమారరామ భీమేశ్వరాలయంగాను పిలుస్తున్నట్టు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 16న స్వామివారి కల్యాణం, 18న మహాశివ రాత్రి ఉత్సవం, 19న రథోత్సవం, 21న శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి.

మహాశివరాత్రికి 20 రోజుల ముందు నుంచే ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని లక్షకు మించి భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేస్తున్నారు. ఉచిత దర్శనంతో పాటు రూ.20, రూ.50, రూ.100 దర్శనాలకు కూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. వీఐపీలకు ప్రత్యేకంగా నిచ్చెనలు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ ప్రధాన ద్వారం నుంచి ఆలయంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం అంతా విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు వీలుగా కోనేరులో కొత్త నీటిని నింపుతున్నారు.

గతంలో కంటే మెరుగైన ఏర్పాట్లు



మహాశివరాత్రి సందర్భంగా గతంలో కంటే మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి వారి కల్యాణం ప్రతి ఒక్కరూ తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. కల్యాణ విశిష్టతను వివరించేలా ప్రముఖ పండితులను నియమిస్తున్నాం. కొనేరు వద్ద గజ ఈతగాళ్లను ఉంచుతున్నాం. తాగునీరు, మజ్జిగ, పాలు, అల్పాహారం, భోజనాలు పంపిణీకి దాతలు ముందుకు వస్తున్నారు.


– డి నాగమల్లేశ్వరరావు, పంచారామక్షేత్ర ఈఓ, సామర్లకోట

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి


ఆపద మిత్రల శిక్షణలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సామర్లకోట: ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండేలా ఆపద మిత్రలకు శిక్షణ ఇస్తున్నామని, ఈ శిక్షణ ఆపద మిత్రలకు అదనపు అర్హతగా ఉంటుందని ఈటీసీ ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో మంగళవారం అనకాపల్లి, తూర్పు గోదావరి జిల్లాలోని ఆపద మిత్రలకు 12 రోజుల పాటు నిర్వహించే 7వ బ్యాచ్ శిక్షణను ఆయన ప్రారంభించారు. వలంటీర్లు, ఆశవర్కర్లు, ఎన్‌సీసీ విద్యార్థుల నుంచి ఉత్సాహంగా ఉన్న వారిని ఆపద మిత్రలుగా ఎంపిక చేస్తామన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితులను ఆదుకొనేలా ఆపద మిత్రలు పని చేయాలన్నారు. ఈ మేరకు ఆయా శాఖలో అనుభవం కలిగిన డాక్టర్లు, అగ్నిమాపక శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, విపత్తుల శాఖలకు చెందిన అధికారులు శిక్షణ ఇస్తారని చెప్పారు.ఆపదలో ఉన్న వారికి రక్షించడానికి, తమను తాము రక్షించుకొవడానికి ప్రభుత్వం రూ.10వేలు విలువ చేసే కిట్లను ఆపద మిత్రలకు అందజేస్తుందని తెలిపారు. 12 రోజుల పాటు జరిగే శిక్షణలో రెండు రోజు ఫీల్డు విజిట్ ఉంటుందన్నారు. విపత్తుల నివారణ సంస్థ జిల్లా మేనేజరు కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు వి శ్రీనివాసరావు, ఎంఎస్ఎన్ రెడ్డి, బి ఆంజనేయులు, కెఆర్ నిహరిక, ఎస్‌కె మోహీద్దీలు శిక్షణ నిర్వహించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ ఎస్సీ పేటకు చెందిన సిద్ధాంతపు లోవరాజు, మేరీకి సంబంధించిన తాటాకిల్లు మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఇంటిలోని గృహోపకరణాలు పూర్తిగా ఆహుతై సుమారు 2 లక్షల వరకూ ఆర్థిక నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశాల మేరకు ఎంపీపీ కారే సుధ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.12 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. మత్స్యకార నాయకులు ఉమ్మిడి జాన్, కంబాల లక్ష్మణ్, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, ఎంపీటీసీలు మేరుగు యల్లాజీ, చొక్కా సింగన్న, అమీనాబాదు సర్పంచి నక్కా మణికంఠబాబు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు గింజాల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

10న జాబ్‌మేళా


కాకినాడ సిటీ: తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు మంగళవారం తెలిపారు. వికాస, రాజానగరం బర్ల సుబ్బలక్ష్మి డిగ్రీ కాలేజీ సంయుక్త ఆధ్వర్యాన ఈ మేళా జరుగుతుందన్నారు. సుమారు 14 కంపెనీల్లో 800 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. సమీర్ ఆగ్రో ఇండస్ట్రీస్, ఐడీఈఎఫ్, నిట్ (ఐసీఐసీఐ బ్యాంక్), ఇండిగో ఎయిర్‌లైన్స్, కోజెంట్ ఈ-సర్వీసెస్, డెక్కన్ కెమికల్స్, ఏపీ టైర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, హోండాయ్ మోబీస్ తదితర సంస్థల్లో వివిధ ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. 5వ తరగతి నుంచి టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఏఎన్ఎం, జీఎన్ఎం, ఏపీహెచ్‌డబ్ల్యూ, బీఎస్సీ, నర్సింగ్ ఉత్తీర్ణులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు.

పాలకొండ వెళ్లి పింఛను అందజేత


నాగమణికి పింఛను అందజేస్తున్న కొండబాబు

కొత్తపల్లి: మండలంలోని గోర్స గ్రామానికి చెందిన కర్నీడి నాగమణి మన్యం జిల్లా పాలకొండలో ఉన్న తన కుమారుడు ఇంటికి వెళ్లి అనారోగ్యం పాలై అక్కడే శస్త్ర చికిత్స చేయించుకుంది. దీంతో వలంటీర్ ఉలవల కొండబాబు మంగళవారం పాలకొండ వెళ్లి వితంతు పింఛను అందజేశారు.

అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా వెంకటలక్ష్మి



సామర్లకోట: మాజీ కౌన్సిలర్, పంచారామ క్షేత్ర ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపారు. తన భార్యకు అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా నియమించడానికి కారణమైన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుకు హరిబాబు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు బోర్డు సభ్యురాలుగా ఎంపికైన వెంకటలక్ష్మికి పలువురు అభినందనలు తెలిపారు.

ఉత్సవాలకు పాదగయ సన్నద్ధం

- భక్తులకు మెరుగైన సౌకర్యాలు
- ఎమ్మెల్యే పెండెం దొరబాబు


పాదగయ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొరబాబు

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలలో సామాన్య భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్టుల్ ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. స్థానిక పాదగయ క్షేత్రంలో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. భక్తులకు తాగు నీరు, వైద్యం, మరుగుదొడ్ల సదుపాయాలు తాత్కాలికంగా ఏర్పాటు చేయాలని సూచించారు. పాదగయ పుష్కరిణిని శుభ్రం చేసి పుణ్యస్నానాలకు అనుకూలంగా తీర్చిదిద్దాలన్నారు. క్యూలైన్లు, మహిళలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లపై దృష్టి సారించాలని, పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రత్యేక యంత్రాల ద్వారా పుష్కరిణిని శుభ్రం చేశామని, ప్రస్తుతం విద్యుద్దీపాలంకరణకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నన్నామని, స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, మున్సిపల్, పోలీసు, విద్యుత్, శానిటరీ, ఇంజినీరింగ్, రోడ్లు భవనాల శాఖ, హెల్త్, శాఖల అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు, పలువురు స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి


రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు మరింత నాణ్యతతో నిర్మించాలని మున్సిపల్ అధికారులను పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆదేశించారు. స్థానిక 13వ వార్డుల్లోని పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. అనంతరం వార్డుల్లో జరుగుతున్న ఆదిత్య స్కూల్ రోడ్డు నిర్మాణ పనులు, డ్రైన్లు, రోడ్లు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన వెంట కౌన్సిలర్ కొట్టి పవన్ కిషోర్, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులున్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ బీవీ రమణ
- డివిజన్ స్థాయి అధికారులతో సమీక్ష


డివిజన్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం పటిష్ఠ అమలుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో బీవీ రమణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై డివిజన్ స్థాయి సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన స్కానింగ్ సెంటర్లు 101 ఉన్నాయని, ఇందులో 10 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్నాయన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో గత ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు 43 డెకాయ్ ఆపరేషన్లు చేపట్టినట్లు తెలిపారు. ఒక్క జనవరి నెలలోనే ఎనిమిది డెకాయ్ ఆపరేషన్లు, 11 ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. డివిజన్ స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల పరిధిలో చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై ఫిర్యాదుకు 18004253365 టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉన్నట్లు ఆర్డీవో రమణ తెలిపారు. అవగాహన కార్యక్రమాల్లో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిని భాగస్వాములను చేయాలని ఆదేశించారు. జీజీహెచ్‌లో గర్భిణులకు అందుబాటులో ఉన్న సేవలపై అగాహన పెంపొందించి, ఆ సేవలను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో మెడికల్ ఆఫీసర్ ఎల్.పావని, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.కృష్ణారావు, డాక్టర్ నూరున్నిసా బేగం, ఎన్‌జీవో ప్రతినిధులు కె.సింహాద్రి, కాకినాడ డివిజన్ సీడీపీవోలు పాల్గొన్నారు.

రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కాకినాడ సిటీ: కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా రవాణా రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య విమర్శించారు. మంగళవారం టీచర్స్ హోంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2014-22 మధ్య కాలంలో పెట్రోలియం ఉత్పత్తులపై మోడీ ప్రభుత్వం రూ.20 లక్షల కోట్ల పన్నులను వసూలు చేసిందన్నారు. ఇదే కాలంలో 11.72 లక్షల మంది వివిధ రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినా బాధితులకు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేసిందని, తక్షణమే రవాణా రంగ కార్మికుల సామాజిక భద్రత కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భూ సర్వే పరిశీలన

కాకినాడ రూరల్: జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష రీ సర్వేకి సంబంధించి మండలంలోని పండూరు, సర్పవరం గ్రామాల్లో జరుగుతున్న రీ సర్వేను ఆర్డీఓ బీవీ రమణ మంగళవారం పరిశీలించారు. రెండు గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో రీ సర్వే వివరాలను తహశీల్దార్ మురార్జీ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ రమణ మాట్లాడుతూ రూరల్ మండలంలో 12 రెవెన్యూ గ్రామాల్లో ఈ రీసర్వే పూర్తయిన నేపథ్యంలో శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకున్నామన్నారు. 4962 ధ్రువ పత్రాలు పంపిణీ చేశామని, 62 వేల పత్రాలు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు.